సాక్షి
కర్నూలు
మంగళవారం ၊ 21 ၊ జనవరి ၊ 2025



జలాధివాసం వీడి..

కొత్తపల్లి: జలాధివాసం వీడుతూ సంగమేశ్వరాలయం బయల్పడుతోంది. శ్రీశైలం డ్యాం నీటి మట్టం 855 అడుగులకు చేరడంతో ఆలయ గోపురాలు కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి.



తెల్లబంగారం @ 7,666

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం పత్తి క్వింటా గరిష్ట ధర రూ.7,666 పలకగా కనిష్ట ధర రూ. 4600గా నమోదైంది. వారం నుంచి ధర పెరుగుతోంది.



శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది రావడంతో క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి.

న్యూస్‌రీల్

ఉద్యోగం పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



వృద్ధుడి నుంచి ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.80 లక్షలు డబ్బులు తీసుకుని కర్నూలుకు చెందిన హసీనా బేగం, మహబూబ్ బాషా మోసం చేశారని కర్నూలు ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన వీర అరుణ్‌కుమార్ ఎస్పీ బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేశారు. తనను మోసం చేసిన వారు కర్నూలు మద్దూర్ నగర్‌లో జాబ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారని ఎస్పీకి తెలిపారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో సమస్యలపై వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడారు. వృద్ధుల వద్దకు ఆయనే స్వయంగా వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి భరోసా కల్పించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 78 ఫిర్యాదులొచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

నేడు డీజీపీ కర్నూలుకు రాక

- నాలుగు జిల్లాల అధికారులతో డీపీఓలో సమీక్ష

కర్నూలు: ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు మంగళవారం కర్నూలు పర్యటనకు రానున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో కర్నూలు రేంజ్ పరిధిలోని పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి. దీంతో ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలతో డీజీపీ సమావేశం కానున్నారు. ఈ నెలాఖరున డీజీపీ పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో సీమ జిల్లాల సమీక్షలో పాల్గొంటున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కొలనుభారతిలో అంగళ్ల నిర్వహణకు నేడు వేలం

కొత్తపల్లి: మండలంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయ ప్రాంగణంలో వివిధ హోటళ్లు, గాజుల, బొమ్మలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్, బెల్లం చెరుకులు, కలింగర పండ్లు తదితర విక్రయాలకు సంబంధించిన అంగళ్ల నిర్వహణకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామలింగారెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేలం పాటలో పాల్గొనేవారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ వేలంలో అన్యమతస్తులు పాల్గొనరాదని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కంది రైతుల కంటతడి!

- ఉమ్మడి జిల్లాలో 2.65 లక్షల ఎకరాల్లో కంది సాగు
- తుఫాను ప్రభావంతో పడిపోయిన దిగుబడులు
- క్వింటా మద్దతు ధర రూ.7,550
- మార్కెట్‌లో లభిస్తున్న ధర రూ.6,500 మాత్రమే
- అన్నదాతలను ఆదుకోని రాష్ట్ర ప్రభుత్వం

కంది పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు నష్టమే మిగులుతోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు కొద్ది రోజులుగా కందులు అమ్మకానికి వస్తున్నాయి. నాణ్యత బాగున్నా మద్దతు ధర లభించకపోవడంతో రైతులు కన్నీళ్లతో ఇంటికి వెళ్తున్నారు. కందుల ధర పడిపోయినప్పటికీ కిలో కంది పప్పు మాత్రం రూ.150పైనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. మద్దతు ధర ఇవ్వడంలో విఫలం చెందుతోంది.



మార్కెట్‌కు వచ్చిన కందులు



పండని కంది పొలం

పురుగు

కంది సాగు వివరాలు (ఎకరాల్లో..)

కర్నూలు జిల్లా	1,58,749
నంద్యాల జిల్లా	1,06,465
మొత్తం	2,65,214

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్‌లో అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితులు వేరుశనగ, పత్తి తదితర పంటలను దెబ్బతీయగా కందిపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే పూత, పిందె దశలో తుఫాన్లు చుట్టుముట్టడంతో కందిలో దిగుబడులు పడిపోయాయి. నెల రోజులుగా కోతలు కూడా ముమ్మరంగా జరుగుతూ మార్కెట్‌లోకి కందులు అమ్మకానికి వస్తున్నాయి. ధర ఒక్కసారిగా పడిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. గతేడాది కందుల ధరలు రికార్డు స్థాయికి వెళ్లడంతో కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ నాఫెడ్ బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేసింది. ప్రస్తుతం ధరలు పడిపోయిన తర్వాత రైతులను పట్టించుకోవడం లేదు.

పెరిగిన పెట్టుబడి వ్యయం

ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు కంది సాగుపై ఆసక్తి చూపారు. రికార్డు స్థాయిలో 2,65,214 ఎకరాల్లో కంది సాగు చేశారు. తుఫాను ప్రభావంతో ఒకవైపు దిగుబడులు పడిపోగా.. మరోవైపు ధరలు మాత్రం రైతులను ఆందోళనలోకి నెట్టాయి. ఈ సారి కందిలో పెట్టుబడి వ్యయం పెరిగింది. రైతులు దాదాపు ఆరు నుంచి 10 సార్లు మందులు పిచికారీ చేశారు. ఒక్కోసారి ఎకరాకు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఖర్చు వచ్చింది. సగటున ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. చివరిలో తుఫాను ప్రభావంతో పూత, పిందె రాలిపోయింది. ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకున్న రైతుల ఆశలు నిరాశగా మారింది. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోంది.

పంటను అమ్ముకున్న తర్వాతనే..

2014–15 నుంచి 2018–19వరకు అధికారంలో ఉన్న టీడీపీ రైతులు పంటలను అమ్ముకోవడం పూర్తి అయిన తర్వాత మద్దతు ధరలతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. కేవలం టీడీపీకి చెందిన రైతులు, వ్యాపారులకు లబ్ధి చేకూర్చడం లక్ష్యంగానే టీడీపీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. అప్పట్లో మార్క్‌ఫెడ్ అధికారులు కేవలం టీడీపీ మద్దతుదారుల నుంచే మద్దతు ధరతో కొనుగోలు చేశారు. ఆ పార్టీ మద్దతుదారులైన వ్యాపారుల నుంచి కూడా హోల్‌సేల్‌గా కందులు కొనుగోలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సారి కూడా రైతులు అమ్ముకోవడం పూర్తి అయిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ మద్దతుదారులైన రైతులు, వ్యాపారులకు మాత్రమే మద్దతు ధర కల్పించాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కనిపించని మద్దతు ధర

క్వింటా కందులకు మద్దతు ధర రూ.7,550 ఉంది. ఇంతకంటే ధర తగ్గితే ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందులకు గరిష్ట ధర రూ.7,000 వరకు ఉన్నప్పటికీ 80 శాతం రైతులకు లభిస్తున్న ధర రూ.6,500 వరకు మాత్రమే. కందులకు ధరలు పడిపోయినపుడు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా వేలాది టన్నులు కొనుగోలు చేసింది. ప్రస్తుతం ధర లేక రైతులు నష్టాలు మూట కట్టుకుంటున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతు భరోసా కేంద్రాల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆత్మస్థైర్యం కలిగించడం లేదు. ఇక్కడ కందిలో దిగుబడులు పడిపోయినప్పటికీ వివిధ రాష్ట్రాల్లో కంది పంట బాగానే ఉంది. రైతులకు మద్దతు ధర రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు.

నష్టమే మిగిలింది



విత్తనాలు లభించకపోయిన ప్పటికీ బ్లాక్‌లో కొని కంది సాగు చేశాం. ఆరుసార్లు పురుగుమందులు పిచికారీ చేయగా రూ.12 వేల వరకు ఖర్చు వచ్చింది. పంట పూత దశలో ఉన్న సమయంలో వర్షాలు రావడంతో రాలి పోయింది. ఆరేడు క్వింటాళ్ల పంట వస్తుందని అనుకున్నాం. కాని మూడున్నర క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. రూ.40 వేలు పెట్టుబడి పెడితే రూ.23 వేలు కూడా రాలేదు. మాకు నష్టమే మిగిలింది.

– రామచంద్రుడు, బావలదొడ్డి, కృష్ణగిరి మండలం, కర్నూలు జిల్లా

పెట్టుబడి కూడా రాలేదు



కందులకు ధర బాగా వస్తుందని నాలుగు ఎకరాల్లో సాగు చేశాం. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల ప్రకారం 16 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించాం. అయితే 8.50 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. మార్కెట్‌లో క్వింటాకు రూ.8,000 వరకు ధర లభిస్తుందని ఆశిస్తే రూ.7,180 మాత్రమే లభించింది. పెట్టుబడి రూ.70 వేలు పెడితే రూ.60 వేలు మాత్రమే వచ్చింది. పెట్టుబడి కూడా దక్కలేదు. కేవలం రెండు నెలల్లోనే ధర పడిపోవడం దురదృష్టకరం.

– బి.లింగప్ప, అగ్రహారం, మద్దికెర మండలం, కర్నూలు జిల్లా

తుఫానులు దెబ్బతీశాయి



మేం 20 ఎకరాల్లో కంది సాగు చేశాం. పంట బాగా పెరిగి పూత భారీగా వచ్చింది. ఎకరాకు కనీసం నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించాం. తుఫానుల బెడద ఎక్కువగా ఉండటంతో పూత, పిందె రాలిపోయి ఎకరాకు రెండు క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు.

– ఆదినారాయణ, వెంకటాపురం, డోన్ మండలం, నంద్యాల జిల్లా

ప్రభుత్వం అనుమతి ఇస్తేనే..



మద్దతు ధరతో కందులను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే మండలానికి ఒక్కటి ప్రకారం 25 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. కందిని మద్దతు ధరతో అమ్ముకునేందుకు రైతుసేవా కేంద్రాల్లో 1,200 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– రాజు, జిల్లా మేనేజర్, మార్క్‌ఫెడ్, కర్నూలు

జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్

- బిందు మాధవ్ కాకినాడకు బదిలీ
- ఏపీఎస్పీ కమాండెంట్‌గా దీపిక పాటిల్
- కమాండెంట్, ఎస్పీ భార్యాభర్తలు



విక్రాంత్ పాటిల్



దీపిక పాటిల్

కర్నూలు: జిల్లా నూతన ఎస్పీగా విక్రాంత్ పాటిల్ నియమితులయ్యారు. ఏపీలో 27 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగింది. ఇందులో భాగంగా ఇక్కడున్న బిందు మాధవ్ కాకినాడకు బదిలీ అయ్యారు. గత ఏడాది జులై 16న కర్నూలు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బిందు మాధవ్ ఇక్కడ ఏడు మాసాలు మాత్రమే పనిచేశారు. అతి తక్కువ వ్యవధిలోనే ఆయనపై బదిలీ వేటు పడటం పోలీసు అధికారుల్లో చర్చనీయాంశమైంది. 2012 ఐపీఎస్ అధికారి విక్రాంత్ పాటిల్ ప్రస్తుతం కాకినాడ నుంచి బదిలీపై జిల్లాకు వస్తున్నారు.

రెండో బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక పాటిల్

ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.దీపిక పాటిల్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఈమెను కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ ఉన్న రవికుమార్ గత ఏడాది సెప్టెంబర్ 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి అనంతపురం 14వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రభు కుమార్ ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్ 1952లో ఏర్పాటైంది. అప్పటినుంచి ఇప్పటివరకు ఏడు మంది ఐపీఎస్ అధికారులు కర్నూలు కమాండెంట్లుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం దీపిక పాటిల్ 32వ కమాండెంట్‌గా నియమితులయ్యారు. ఈమె 2019 జూన్ 24 నుంచి 2020 జనవరి 2వ తేదీ వరకు 6 మాసాల పాటు కర్నూలు అడిషనల్ ఎస్పీగా కూడా పనిచేశారు. ఈమె తండ్రి మండవ హర్షవర్ధన్ జార్ఖండ్ ఐపీఎస్ అధికారి. కృష్ణా జిల్లా ఆముదాల లంక స్వగ్రామం. ఈమె సోదరుడు హర్షవర్ధన్ కూడా ఐపీఎస్ అధికారి. విక్రాంత్ పాటిల్, దీపిక పాటిల్ భార్యాభర్తలు. వీరిది ప్రేమ వివాహం. ప్రస్తుతం వీరిద్దరిలో ఒకరు కర్నూలు ఎస్పీగా, మరొకరు రెండో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీపై వస్తున్నారు.

ఉపాధి పనుల్లో తగ్గిన హాజరు

- గత ఏడాది ఇదే సమయంలో 1.15 లక్షల మంది కూలీలు హాజరు
- నేడు 62 వేల మందికే పరిమితం
- సగానికిపైగా పంచాయతీల్లో కానరాని పనులు



డ్వామా పీడీ తనిఖీలో అరకొరగా కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామాల్లో వ్యవసాయ పనులు దాదాపు పూర్తయినా ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెరగడం లేదు. జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు పూర్తి స్థాయిలో పనులు పెట్టకపోవడంతోనే లేబర్ రిపోర్టింగ్ అతి తక్కువగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో రోజుకు 1.15 లక్షల మంది వరకు ఉపాధి పనులకు హాజరయ్యారు. ఈ నెల 20వ తేదీ ఉపాధి పనులకు హాజరైన కూలీల సంఖ్య 62,834 మాత్రమే. కర్నూలు జిల్లాలో 42,018, నంద్యాల జిల్లాలో 20,816 మంది మాత్రమే హాజరైనట్లు స్పష్టమవుతోంది. ఇందులో కూడా బోగస్ హాజరు ఉందనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు లేకపోవడం గమనార్హం. పశ్చిమ ప్రాంతంలో రెండు నెలల క్రితమే పంటల సీజన్ పూర్తయింది. అక్కడ వెంటనే ఉపాధి పనులు చేపట్టకపోవడంతో జిల్లా నుంచి వలసలు పెరిగాయి. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సంక్రాంతి పండగ కోసం తిరిగి వచ్చారు. పండుగ ముగియడమే తరువాయి మళ్లీ వలసలు ఊపందుకున్నాయి. పశ్చిమ ప్రాంతమైన ఆలూరు, ఆదోని, కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం, హాలహర్వి, హొళగుంద నుంచి కూలీలు, రైతులు పెద్ద సంఖ్యలో వలస పోతున్నారు.

కడప డీఈఓగా డైట్ లెక్చరర్

కర్నూలు సిటీ: వైఎస్ఆర్ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా కర్నూలు ప్రభుత్వ డైట్ కాలేజీలో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న ఎస్.షంషుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది చివరిలో డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న జనార్దన్ రెడ్డిని నంద్యాల జిల్లా డీఈఓగా నియమించారు. అప్పటి నుంచి రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో షంషుద్దీన్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులు కావడంతో డైట్ కాలేజీ ఉద్యోగులు ఆయనను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

వైద్య ఆరోగ్యశాఖ అధికారికి చార్జ్ మెమో

- మరో ముగ్గురు ఉద్యోగులకు కూడా
- సకాలంలో పోస్టులు భర్తీ చేయని ఫలితం

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో పాటు మరో ముగ్గురు ఉద్యోగులకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి చార్జ్ మెమోలు జారీ చేశారు. ఆ శాఖలో గత నవంబర్‌లో ఐదు ల్యాబ్‌టెక్నీషియన్(కాంట్రాక్టు), మూడు ఎఫ్ఎన్ఓ, శానిటరీ/వాచ్‌మెన్(అవుట్‌సోర్సింగ్) పోస్టులను భర్తీ చేయాలని డీహెచ్ నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి ఉత్తర్వులొచ్చాయి. ఆ కాపీని తపాల్ సెక్షన్ నుంచి సంబంధిత సీనియర్ అసిస్టెంట్‌కు చేరింది. అయితే, అతను దానిని పూర్తిగా చదవకుండా ఉన్నతాధికారులకు పంపకుండా తన వద్దే ఉంచుకున్నాడు. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ఈ పోస్టుల విషయమై ఓ ఉన్నతాధికారి సంబంధిత క్లర్క్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగారు. మొదట విషయం తెలియనట్లు మాట్లాడినా, తర్వాత పని ఒత్తిడి కారణంగా చేయలేదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు సమాచారం. ఇదే విషయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులకు సదరు అధికారి చెప్పడంతో నేరుగా డీహెచ్ రంగంలోకి దిగి డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయని కారణంగా డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళతో పాటు కార్యాలయ ఏఓ అరుణ, ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు, మరో క్లర్క్‌కు చార్జ్ మెమోలు జారీ చేశారు. అయితే ఈ విషయంలో తప్పు సంబంధిత క్లర్క్ చేయగా అతన్ని వదిలి ముగ్గురు అధికారులను, సంబంధం లేని క్లర్క్‌కు చార్జ్ మెమోలు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఇది వారి ఉద్యోగ పదోన్నతులపై ప్రభావం చూపుతుందని చర్చ జరుగుతోంది.

కక్షపూరితంగానే డీలర్ల తొలగింపు

- అక్రమ కేసులు పెట్టడం మంచిదికాదు
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కలెక్టర్ రంజిత్‌బాషాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షపూరితంగా 25 ఏళ్లనుంచి పనిచేస్తున్న డీలర్లను తొలగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. తొలగించిన డీలర్లపై టీడీపీ నాయకులు కేసులు పెట్టిస్తున్నారని, ఆ పార్టీ తొత్తులుగా అధికారులు పనిచేయడం మంచిది కాదన్నారు. చర్యలు తీసుకోవాలని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కల్లూరు మండలంలో మార్కాపురం, తడకనపల్లె డీలర్లను ఇదివరకే తొలగించారని, ఇటీవల బస్తిపాడు డీలర్ రామ్మోహన్‌రెడ్డిని తొలగించి ఆయనతోపాటు మరికొందరిపైనే కేసుపెట్టించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఇళ్లు, పంటలను నాశనం చేస్తున్నారని, ఇందుకు ఇటీవల గడివేముల మండలం పైబోగుల సంఘటనే నిదర్శనమన్నారు. ఎన్ని అక్రమ కేసులుపెట్టినా, ఎంత హింసించినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు.

ఆరిపోయిన ఆశల దీపాలు

- ఎర్రనాలవాగులో పడి అక్కాతమ్ముడు మృతి
- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- జంపాపురంలో విషాద ఛాయలు

**వారి ఆశలన్నీ కుమార్తె, కుమారుడిపైనే
మంచి చదువులు చెప్పించాలనేది లక్ష్యం
ఎంత కష్టాన్ని అయినా ఓర్చుకునే సహనం
తమ పిల్లల గురించి చెబుతూ మురిసిపోయేవారు
అయితే విధి పగబట్టింది..
ఎర్రనాలవాగు రూపంలో వారి ఆశలను ఆర్పేసింది
ఎర్రమట్టి కోసం అక్రమార్కులు చేసిన లోతట్టు
ఇద్దరు పిల్లలను మింగేసింది
జంపాపురంలో విషాదం అలుముకుంది**



చిన్నారులను మింగిన ఎర్రనాలవాగు





నరసమ్మ, రఘువరన్ (ఫైల్)

కోసిగి: ఎర్రనాలవాగులో నీళ్లుతాగేందుకు వెళ్లి కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన కురువ పెద్దనరసింహులు, పద్మావతి కుమార్తె నరసమ్మ(12), చిన్న కుమారుడు రఘువరన్(10) మృతిచెందారు. ఈ దుర్ఘటన సోమవారం చోటుచేసుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు దేవేంద్ర కోసిగిలో మౌంట్ కార్మెల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కుమార్తె నరసమ్మ ఎమ్మిగనూరు బాలికల హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతోంది. చిన్న కుమారుడు రఘువరన్ గ్రామంలో ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు.ఆ కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఉంది. పొలంలో మొక్కజొన్నను సాగుచేసుకున్నారు. సంక్రాంతి సెలవులు పూర్తికావడంతో సోమవారం పెద్ద కుమారుడు దేవేంద్ర పాఠశాలకు వెళ్లాడు. కుమార్తెను హాస్టల్‌లో వదిలేసి వచ్చేందుకు తండ్రి నరసింహులు వార్డెన్‌కు ఫోన్ చేశాడు. మొదటి రోజు పిల్లలు రాలేదని, రెండు రోజులు ఆగి రమ్మని వార్డెన్ చెప్పారు. తల్లి పద్మావతి ఇతర పొలాలకు కూలీ పనులకు వెళ్లగా.. తండ్రి నరసింహులు పెంచుకుంటున్న గొర్రెలను తీసుకుని పొలానికెళ్లాడు. తండ్రితో పాటు అక్కాతమ్ముడు నరసమ్మ, రఘువరన్ కలిసి వెళ్లారు. గ్రామం నుంచి సాతనూరు కొట్టాల గ్రామానికి వెళ్లే దారిలో ఎర్రనాల వంక ఉండగా.. ఎర్రమట్టి కోసం అక్రమార్కులు దానిని తవ్వడంతో లోతట్టు ఏర్పడింది. ఆ వంకలో ఆరు అడుగుల మేర లోతులో నీళ్లు నిలిచి ఉండగా గొర్రెలకు తాపేందుకు ముగ్గురు చిన్నారులు వెళ్లారు. గొర్రెలకు నీళ్లు తాగించి బయటకు వదిలేసి.. రఘువరన్ దప్పిక తీర్చుకునేందుకు వంకలో కొద్ది దూరం లోతుకు వెళ్లి మునిగిపోయాడు. తమ్ముడిని కాపాడేందుకు నరసమ్మ ప్రయత్నం చేస్తూ మునిగిపోయింది. ఒడ్డున ఉన్న వాళ్ల చిన్నాన్న కుమారుడు వంశీ అరుపులు వేయడంతో చుట్టు పక్కల పొలాల రైతులు, గ్రామస్తులు వచ్చి వంకలో దూకి పిల్లలను బయటకు తీశారు. అప్పటికే నరసమ్మ, రఘువరన్ మృతి చెందారు. పిల్లలు మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్యం వైపు పరుగు

- కొనసాగుతున్న పోలీసు దేహదారుఢ్య పరీక్షలు
- పదో రోజు ప్రధాన పరీక్షకు 248 మంది ఎంపిక



పరుగుపందెంలో పోటీ పడుతున్న పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులు

కర్నూలు: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడుతున్నారు. ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో పోలీసు అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం పదో రోజు 600 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 362 మంది బయోమెట్రిక్ పరీక్షకు హాజరయ్యారు. వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ చుట్టు కొలతలు వంటి ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు నిర్వహించారు. ఇందులో 248 మంది అభ్యర్థులు ప్రతిభ కనబర్చి ప్రధాన పరీక్ష (మెయిన్స్)కు అర్హత సాధించారు. ఏదైనా సమస్యలపై ఇతర కారణాలతో అప్పీల్ చేసుకున్న అభ్యర్థులు ఈనెల 28వ తేదీన హాజరుకావాలని పోలీసు అధికారులు సూచించారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు సెలవు దినాలు మినహా పోలీసు అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఎస్పీ బిందు మాధవ్‌తో పాటు సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాజ్ డ్రమ్మర్ షేక్ ఫయాజ్ మృతి


జాజ్ డ్రమ్మర్ షేక్ ఫయాజ్

కర్నూలు కల్చరల్: సెవెన్ స్టార్ ఆర్కెస్ట్రా, రికార్డింగ్ స్టూడియో అధినేత జాజ్ డ్రమ్మర్ షేక్ ఫయాజ్ (57) ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారం క్రితమే కుమార్తె వివాహం ఘనంగా జరిపించారు. ఫయాజ్ 30 ఏళ్లక్రితం కర్నూలు నగరంలో సినిమా ఆర్కెస్ట్రాలో జాజ్ డ్రమ్మర్‌గా చేరి తదనంతరం సెవెన్ స్టార్ ఆర్కెస్ట్రాను స్థాపించారు. తరువాత రికార్డింగ్ స్టూడియోను ఏర్పాటు చేసి ఎంతో మంది కళాకారులకు సంగీతాన్ని, రికార్డింగ్‌ను అందించారు. రికార్డింగ్ కోసం హైదరాబాద్, చెన్నైలకు వెళ్లేవారికి వ్యయ ప్రయాసాలను తగ్గించారు. 2016లో అప్పటి ఎస్పీ ఆకె రవికృష్ణ ఆధ్వర్యంలో నేత్ర దానంపై 'చెయ్ చెయ్ చెయ్ నీ కళ్లను దానం చెయ్' పాటకు కొరియోగ్రఫీ చేసి అందరినీ మెప్పించారు. ఈ నెల రెండో వారంలో కోడుమూరు సీఐ తబ్రేజ్ ఆధ్వరంలో 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'పై రూపొందించి వీడియో సాంగ్‌ను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ విడుదల చేశారు. చేశారు. ఫయాజ్ మరణ వార్త విని కర్నూలు కళాకారులు కన్నీటి పర్యంతమయ్యారు. సినీ మ్యూజిక్ డైరెక్టర్ ప్రకాష్, ఇతర కళాకారులు ఫయాజ్ అంత్య క్రియల్లో పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోడుమూరు రూరల్: కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దపాడు గ్రామంలో కల్లులో పురుగు మందు కలుపుకుని తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కె.నాగలాపురం ఎస్ఐ ఆశాలత తెలిపిన వివరాలు.. తెలంగాణలోని అలంపూర్‌కు చెందిన కురువ వెంకటేశ్వర్లు (52) 8 ఏళ్ల క్రితం పెద్దపాడుకు కుటుంబంతో సహా వసల వచ్చి ఇక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం ఊరి చివర ఉన్న శ్మశానవాటికలో కల్లులో పురుగు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం పోలీసులు ఘటనా స్థలానికి పరిశీలించారు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో కార్మికునికి గాయాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామ సమీపంలో ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమలో విద్యుదాఘాతానికి గురై ఓ కార్మికుడు గాయాలపాలయ్యాడు. ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాలు.. గడివేముల మండలం ఎల్‌కే తండా గ్రామానికి చెందిన జయరాం నాయక్ పుట్టగొడుగుల పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం విధులు నిర్వర్తిస్తుండగా విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఛాతి, వీపు, నడుముకు కాలిన గాయాలయ్యాయి. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఓర్వకల్లు సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కాగా ప్రమాద ఘటనపై పోలీసుకు, బాధిత కుటుంబ సభ్యులకు పరిశ్రమ నిర్వాహకులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో పాటు ఇదే విషయంపై ఫోన్‌లో 'సాక్షి' ఆరా తీయగా కార్మికుని తప్పిదం వల్లే ప్రమాదం జరిగిందని సమాధానం చెప్పడం గమనార్హం.


గాయపడిన జయరాం నాయక్

'వెలసి'న బతుకులు..!

- పెయింటర్ల పొట్టకొడుతున్న ఆధునిక యంత్రాలు
- ఉపాధి దొరక్క అవస్థలు
- పెయింటింగ్ వృత్తికి స్వస్తి
- ఇతర ఉపాధి మార్గాలు ఎంచుకుంటున్న పెయింటర్లు
- ఆదుకోని కూటమి ప్రభుత్వం

పెయింటింగ్ వృత్తిని నమ్ముకున్న కుటుంబాల జీవితాలు వెలసిపోతున్నాయి. ఏళ్ల తరబడి ఇదే వృత్తిని నమ్ముకున్న పెయింటర్లు.. ఆధునిక యంత్రాల రంగప్రవేశంతో పనులు దొరక్క ఆకలికేకలు పెడుతున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెయింటర్ల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతో ఆ కుటుంబాలు దుర్భర జీవనాన్ని గడుపుతున్నాయి.
– కోవెలకుంట్ల

జిల్లాలో సుమారు 22 వేల కుటుంబాలు పెయింటింగ్ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. ఇందులో నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో దాదాపు 3,500 కుటుంబాలు పెయింటింగ్ వృత్తిని నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాయి. కాగా కొన్నేళ్ల నుంచి ఆయా కుటుంబాలకు వృత్తి కలిసి రాకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నాయి. గతంలో సాధారణ ఇంటి నుంచి రెండు, మూడు అంతస్తుల భవనాలు, వ్యాపార సముదాయాలు తదితర కార్యాలయాలకు పెయింటర్లు రంగులు వేసేవారు. ఏడాదిలో ఆరు నెలల పాటు వారికి పని పుష్కలంగా ఉండి ఉపాధి దొరికేది. పెయింటింగ్ వేసేందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో పదిహేనేళ్ల నుంచి పెయింటర్లకు రంగులు వేసే పనులు కరువయ్యాయి. సాధారణ రంగు నుంచి రకరకాల డిజైన్లను యంత్రాలే వేస్తుండటంతో పెయింటర్లు నిరాదరణకు గురవుతున్నారు. అరకొరగా పని దొరికినా ఉదయం నుంచి చీకటి పడే వరకు రంగు వేసినా రూ.500 కూలి రావడం గగనమైంది. అది కూడా ఏడాదిలో కేవలం రెండు, మూడు నెలలే పనులు ఉండటంతో పెయింటర్ల ఆందోళన చెందుతున్నారు. ఆధునిక యంత్రాలకు తోడు ఇళ్ల నిర్మాణాలు చేపట్టే గడేకాళ్ల మేస్త్రీలు పెయింటింగ్ పనులను కూడా ఒప్పుకుని ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో పనులు చేయిస్తుండటంతో స్థానిక పెయింటర్లకు పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.


ఆలయానికి పెయింటింగ్ వేస్తున్న పెయింటర్లు

జూల కొట్టడంలో పొంచి ఉన్న ప్రమాదం

ఇళ్లు, భవంతులకు రంగులు వేసే క్రమంలో జూల కొట్టడం ప్రమాదంతో కూడుకున్న పని. తప్పని పరిస్థితుల్లో పెయింటర్లు ఈ పనులు సైతం చేయాల్సి వస్తోంది. జూల కొట్టే క్రమంలో పెయింటర్ ప్రాణాలు.. తాడు పట్టుకునే సహాయకుడిపై ఆధార పడి ఉంటాయి. ఇరువురు ఏమాత్రం ఏమరపాటు వహించినా పెయింటర్ కింద పడి ప్రాణాలు కోల్పోవాల్సిందే. ప్రాణాలకు తెగించి పెయింటింగ్ వృత్తిని నమ్ముకున్న కుటుంబ పోషణ భారంగా మారటంతో ఆయా కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. రంగులు వేయగా వచ్చిన కూలి డబ్బుతోనే కుటుంబ పోషణ, పిల్లల చదువులకు వెచ్చించాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల కులవృత్తులకు విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ పథకంలో పెయింటర్లను చేర్చకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెయింటర్లను ఆదుకోవడంలో విఫలం కావడంతో అష్టకష్టాలు పడుతున్నారు. పెయింటర్లకు పింఛన్లు, పక్కాగృహాలు, ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణాలు, ఇళ్ల స్థలాలు, తదితర సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడంతో కష్టాన్ని నమ్ముకుని కాలం నెట్టుకొస్తున్నారు.


కోవెలకుంట్లలో గుడి గోపురానికి రంగులు వేస్తున్న పెయింటర్లు

ప్రత్యామ్నాయం వైపు పెయింటర్లు

ఎన్నో ఏళ్ల నుంచి పెయింటింగ్ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పెయింటర్ల జీవితాలను ఆధునిక యంత్రాలు కాలరాస్తున్నాయి. పెయింటింగ్ పనులు లేకపోవడంతో కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. మరికొందరు ఆ వృత్తికి స్వస్తి చెప్పి ఇతర ఉపాధి అవకాశాలవైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పెయింటింగ్ షాపులు, కిరాణా షాపుల్లో గుమాస్తాలు, పూల అంగళ్లు, గౌండా పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ పనులు చేస్తున్నా కూలి డబ్బు అంతం మాత్రంగానే వస్తుండటంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వం పెయింటర్లను అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పనుల్లేవు



కొన్ని ఏళ్ల నుంచి పెయింటింగ్ పనులు చేయించే కూలీల మేస్త్రిగా పనిచేస్తున్నాను. పదిహేనేళ్ల క్రితం వరకు పెయింటింగ్ రంగంలో చేతినిండా పని దొరికేది. రంగులు వేసేందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో ప్రతి ఒక్కరూ వాటి ద్వారానే రంగులు వేయించుకుంటున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ వృత్తిని నమ్ముకున్న మాలాంటి కుటుంబాలకు పని దొరక్క ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాం.
– సుబ్బయ్య, పెయింటింగ్ కూలీల మేస్త్రి, కోవెలకుంట్ల

ప్రభుత్వమే ఆదుకోవాలి



రంగులు వేసే పనులు అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ వృత్తి ద్వారా కుటుంబ పోషణ భారంగా మారింది. నాకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. కొన్ని సందర్భాల్లో పెయింటింగ్ పనులు లేకపోవడంతో పురుగు మందుల దుకాణంలో గుమాస్తాగా వెళ్తున్నాను. ప్రభుత్వం పెయింటర్లకు పింఛన్లు, రుణాలు, పక్కాగృహాలు, తదితర పథకాలు అందజేసి ఆదుకోవాలి.
– కుమార్, పెయింటర్, కోవెలకుంట్ల

ఉమ్మడి జిల్లా విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రిపబ్లిక్ డేను పురస్కరించుకుని నంద్యాల కాస్మో పాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్, షటిల్, డబుల్స్, మిక్స్‌డు, ట్రిబుల్స్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కన్వీనర్ ఖాన్, నిర్వాహకులు రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీనివాసులుబాబు, మురళీ మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా భావించాలన్నారు. అనంతరం మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.1000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీహెచ్ వెంగళరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం-2025 క్యాలెండర్‌ను సోమవారం ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంగళరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవోస్ జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షుడు కేశన్న, కార్యదర్శి రామకృష్ణ, సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసీ నరసింహులు, జిల్లా కార్యదర్శి ఎన్‌డీ సంపత్‌కుమార్, కోశాధికారి ఎస్.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని డీఎస్పీగా హేమలత



ఆదోని అర్బన్: ఆదోని డీఎస్పీగా హేమలత బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన ఈమె 2022లో గ్రూప్–1క సెలెక్ట అయ్యారు. ఇటీవల ట్రైనింగ్ ముగించుకొన్న హేమలతకు ఉన్నతాధికారుల ఆదోని డీఎస్పీగా నియమించారు. దీంతో సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని, ఏమైనా సమస్య ఉంటే నేరుగా ప్రజలను తనను కలవవచ్చునని చెప్పారు. ఇటీవల చాలా మంది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారని, దీనిపై ఆదోని, చుట్టుపక్కల గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు.

కేపీ గుడిసెలలో స్పెయిన్ బృందం


కేపీ గుడిసెలలో స్పెయిన్ బృందం సభ్యులు

తుగ్గలి: మండల పరిధిలోని కొత్తపలి గుడిసెల గ్రామాన్ని సోమవారం స్పెయిన్ బృందం సందర్శించింది. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) రీజినల్ డైరెక్టర్ సరస్వతి, పార్టనర్ రిలేషన్ డైరెక్టర్ షీబారాణి, సర్పంచ్ రంగమ్మ గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, విద్యాభివృద్ధి కోసం ఆర్డీటీ చేపట్టిన కార్యక్రమాలను వారు పరిశీలించారు. స్పెయిన్ దేశస్తుల సహకారంతో రూ.1.2 కోట్లతో ఆర్డీటీ గ్రామంలో నిర్మించిన 36 ఇళ్లను డొనేటర్ల బృందం సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించి ఎన్ని కష్టాలు ఎదురైనా పిల్లలను చదివించాలన్నారు. మనతో ఎలాంటి అనుబంధం లేకున్నా పేదలకు సాయం చేస్తున్న స్పెయిన్ దేశస్తుల సహకారం అభినందనీయమని సర్పంచ్, ఆర్డీటీ ప్రతినిధులు అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏటీఎల్ రెహనా పాల్గొన్నారు.

దొంగల కోసం ముమ్మర గాలింపు

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ జావళి


గాలిస్తున్న డాగ్‌స్క్వాడ్

పాణ్యం: శాంతిరామ్ ఆసుపత్రి సమీపంలో ఆదివారం రాత్రి దంపతులపై దారిదోపిడీకి పాల్పడిన దొంగల కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. సోమవారం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ముందుగా ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. దుండగులు ఇద్దరు యువకులని, హిందీలో మాట్లాడారని బాధితురాలు జయమ్మ ద్వారా తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కొలూరు సమీపంలో రైల్వే డబ్లింగ్, పవర్‌గ్రీడ్ పనులు చేస్తున్న హిందీ కూలీలను విచారించారు. డీఎస్పీ జావళి సైతం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్‌రెడ్డితో ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాధితుడికి భారీగా కత్తిపోట్లు

రహదారి పక్కన తన భార్య బహిర్భూమికి వెళ్లడంతో పక్కనే ఉన్న జొన్న పొలం నుంచి ఇద్దరు యువకులు అతి వేగంగా వచ్చి దామరేకుల పెద్దన్నపై కత్తితో దాడి చేశారు. అతని తలపై మూడు చోట్లా చ కాళ్లకూ మరికొన్ని కత్తిపోట్లు ఉన్నాయి. తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలో పడిపోయాడు. మరోవైపు దొంగల బారి నుంచి తప్పించుకున్న జయమ్మ భర్త వద్దక వచ్చి అతికష్టం మీద ఆసుపత్రికి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఎమర్జెన్సీలో చికిత్స పొందుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వెలుగోడు: శ్రీశైలం నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తప్పుడు హామీలతో ఎన్నికల్లో గెలిచిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అర్హులైన వారి పింఛన్లు తొలగిస్తే సహించేది లేదన్నారు. తెలుగుగంగ రిజర్వాయర్‌లో పుష్కలంగా ఉన్న నీటిని రబీ పంటలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటలు ఎండిపోకుండా తన స్వంత ఖర్చులతో మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేశానని గుర్తు చేశారు. గతంలో పండించిన పంటలకు రైతులకు మంచి గిట్టుబాటు ధర ఉండేదని, కూటమి ప్రభుత్వంలో ధరలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగోడులో ఇటీవల అనారోగ్యంతో మాజీ వలంటీర్ ఆరిఫ్ జహా మృతి చెందగా స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ సయ్యద్ సులేమాన్ ఇంటి దగ్గరికి వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. శిల్పా వెంట పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, తెలుగు రమణ, వెంకటరెడ్డి, ఆరిఫ్ షంషీర్ అలీ ఖాన్, నాగేశ్వర్ రెడ్డి, బోగోలు సుదర్శనం, గోవిందు, శ్రీనివాసులు, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ పెన్షనర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు టౌన్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి ప్రైవేట్, కార్పొరేట్ వైద్యశాలల్లో హెల్త్‌కార్డుల ద్వారా సత్వర వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల మహాసభలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రెస్టోరేషన్(పునరుద్ధరణ) చేయాలన్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన మెడికల్ రీయింబర్స్‌మెంట్, డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, అంతవరకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలోని 1.60 లక్షల మందికి పైగా పెన్షనర్లు హెల్త్ కార్డులపై ప్రతి నెలా పెన్షన్‌లో ప్రీమియం రూపంలో రూ.81 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. హెల్త్‌కార్డులపై సరైన వైద్యం అందించకుంటే ఆ చెల్లింపులను నిలిపివేసే పరిస్థితిని తెచ్చుకోవద్దని ప్రభుత్వానికి సూచించారు. పెన్షనర్ల సమస్యలపై ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, ఈ ఆర్థిక సంవత్సరంలో దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. హెల్త్‌కార్డులు ఆంధ్ర, తెలంగాణతోపాటు కర్ణాటక, తమిళనాడులోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీఎస్ అబ్దుల్ కరీంసాహెబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దన్న గౌడ్, కోశాధికారి శర్మ, జిల్లా జేఏసీ చైర్మన్ వెంకళరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు మద్దిలేటిరెడ్డి, తాలూకా అధ్యక్షుడు ఏపీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో జనవరి 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా రైతులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాల ద్వారా నట్టల నివారణ మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధినిరోధక టీకాలు, పశు వ్యాధినిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తారని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఇన్‌చార్జి డీఆర్వో వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారిగా రుద్రా రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారిగా డాక్టర్ రుద్రా రెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 19న విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనను రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర సంఘంలో పదవి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. హ్యాండ్‌బాల్ క్రీడ అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకుడికి నోటీసులు


వాటర్ ప్లాంట్ నిర్వాహకుడికి నోటీసులు అందజేసిన అధికారులు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు తులసీరాముడుకు వాటర్ ప్లాంట్ నిలిపేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియలు పోలీసుల బందోబస్తు మధ్య సోమవారం గ్రామానికి చేరుకుని వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన తులసీరాముడికి వాటర్ ప్లాంట్ నిలిపివేయాలని ఉత్తర్వులతో కూడిన నోటీసులు అందజేశారు. బోరు బోరుకు 250 మీటర్ల దూరం ఉండాలని, తులసీరాముడు బోరు వల్ల అక్కడే ఉన్న పంచాయతీ బోర్లకు నీరు అందక గ్రామంలో నీటి ఎద్దడి నెలకొందని, ప్రజల ఇబ్బందులు పరిగణలోనికి తీసుకొని వాల్టా చట్టం నిబంధనల మేరకు ఉత్తర్వులు జారీ చేశామని అధికారులు తెలిపారు. కాగా గ్రామంలో ఎన్నో బోర్లు ఉన్నా.. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడినైనందుకే రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని బాధితుడు తులసీరాముడు ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్వాన్స్ చెక్కులు ఇచ్చే వరకు కదలం

- ఎన్ఎస్‌సీ ఎదుట వేరు శనగ రైతుల ఆందోళన
- కార్యాలయానికి తాళం వేసి నిరసన


ఎన్ఎస్‌సీ కార్యాలయానికి తాళం వేస్తున్న రైతులు

నంద్యాల(అర్బన్): వేరుశనగ దిగుబడులకు సంబంధించి అడ్వాన్స్ చెక్కులు ఇచ్చే వరకు కదలమని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం నూనెపల్లెలోని నేషనల్ సీడ్ కార్పొరేషన్(ఎన్ఎస్‌సీ) కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఉద్యోగులను బయటకు పంపి కార్యాలయానికి తాళం వేసి అక్కడే బైఠాయించారు. జిల్లాలోని ఎం.కృష్ణాపురం, డబ్ల్యూ.గోవిందిన్నె, యాళ్లూరు, రేవనూరు తదితర గ్రామాలకు చెందిన 50 మంది రైతులు నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా వేరుశనగ సీడ్ విత్తనాలను తీసుకుని గత ఏడాది జూలై మాసంలో సాగు చేశారు. దాదాపు ఎకరాకు రూ.80వేలు ఖర్చు చేసి పంట దిగుబడులను సాధించారు. గత ఏడాది 40 కేజీల బస్తాలు 35 నుంచి 40 రాగా ఈ ఏడాది 25 నుంచి 27 బస్తాలు మాత్రమే వచ్చాయి. పంట సాగు సమయంలో ఏఎస్ఎస్‌సీఏ, ఎన్ఎస్‌సీ అధికారులు వచ్చి పంట దిగుబడులను పరిశీలించి వెళ్లారు. ఆయా గ్రామాల రైతులు 25 ఏళ్లుగా సీడ్ వేరుశనగ విత్తనాలను సాగు చేస్తూ ఎన్ఎస్‌సీకి అప్పగిస్తూ వస్తున్నారు. దిగుబడులు బాగున్నాయనే కారణంతోనే రైతులు వేరుశనగను ఎన్ఎస్‌సీలో నిల్వ ఉంచారు. ఎన్ఎస్‌సీలో ఉంచిన 15 రోజుల్లోగా అడ్వాన్స్ చెక్కులు ఇవ్వాలి. 50 రోజులు గడుస్తున్నా ఇవ్వకపోగా దిగుబడుల్లో నాణ్యత లేదంటూ వెనక్కి తీసుకో పోవాలని చెప్పడంతో రైతులు ఆందోళన చేపట్టారు. పంటల దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయిన తమకు విత్తన నాణ్యత లేదంటూ చెప్పడం ఏమిటని రైతులు నెహ్రూరెడ్డి, తిరుపంరెడ్డి, వెంకటరామిరెడ్డి, రంగస్వామిరెడ్డి, ధనుంజయరెడ్డి, గోపాల్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, పాండురంగారెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలకు ఇటీవల అధికారులు జర్మినేషన్ చేయగా టెస్టింగ్‌లో ఫెయిల్ కాలేదన్నారు. ఎన్ఎస్‌సీ అధికారులు తమకు ఇచ్చిన 20 కేజీల సంచుల్లో 3 కేజీలు రాళ్లు వచ్చాయని, ఆర్గనైజర్లతో నకిలీ విత్తనాలు చేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు.ఈ ఏడాది దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోయిన తమను ఇలా అవమానించడం అధికారులకు తగదని, న్యాయం చేయకపోతే ప్రతి రోజూ కార్యాలయం వద్దకు వచ్చి నిరసన చేపడుతామని హెచ్చరించారు. ఈ విషయంపై ఎన్ఎస్‌సీ మేనేజర్ మోహన్‌రాజును వివరణ కోరగా.. వేరుశనగ పంట విత్తనాలను ప్రాసెసింగ్ చేసి బయటి రైతులకు ప్రొక్యూర్ చేయాల్సి ఉందన్నారు. కొంత మంది రైతులు తెచ్చిన వేరుశనగ విత్తన దిగుబడులు రంగు మారడంతో శ్యాంపిల్స్‌ను ఢిల్లీలోని ఫిజికల్ ప్యూరిటీ టెస్టింగ్‌కు పంపామన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు రైతులకు చెక్కుల ఇచ్చే కార్యక్రమం చేపడతామని చెప్పారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు

కర్నూలు(హాస్పిటల్): అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ చెప్పారు. సోమవారం స్థానిక ఎ.క్యాంపులోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వచ్చే నెల 2 వరకు సర్వే కొనసాగుతుందని, కుష్టు అనుమానిత లక్షణాలు ఉంటే ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారితో వ్యాధినిర్ధారణ చేసి ఎండీటీ మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ చర్మంపై, చెవులపై, కణితలపై స్పర్శలేని మచ్చలు ఉన్నా, చేతుల నుంచి వస్తువులు జారిపోతున్నా, కాళ్లలో పుండ్లు, చెప్పులు జారిపోవడం మొదలైన లక్షణాలు ఉంటే పరీక్షకు పంపించాలన్నారు. జిల్లా న్యూక్లియస్ అధికారి డాక్టర్ జి.మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడు తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కుష్టు వ్యాధి అనుమనితులు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓపీ నెంబర్ 37లో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ నెం.37 వైద్యాధికారి రమశిరీష, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మాధవి పాల్గొన్నారు.